

మెదక్ అల్లర్ల కేసులో 16 మందికి బెయిల్

మెదక్ అర్బన్, జూన్ 21: మెదక్‌లో జరిగిన అల్లర్ల ఘటనలో పట్టణ పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో 16 మందికి జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరు రూ.15 వేల బాండ్‌తో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్, న్యాయవాది సంతోష్‌రెడ్డి బీజేపీ నేతల తరపున వాదనలు వినిపించారు.





ఏరువాక పున్నమి సందడి

ఏరువాక పున్నమిని రైతులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి అందరూ బాగుండాలని, రైతుల పాడిపంటలు బాగుండాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం అల్లూరు గ్రామంలో ఏరువాక పున్నమి సందర్భంగా ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఖేడ్, నాగల్‌గిద్ద గ్రామాల్లో ఎద్దులకు రంగు రంగుల తాళ్లతో, బెలూన్లతో అందంగా అలంకరించి ఆలయాల చుట్టూ ప్రదర్శనలు చేయించారు. ఎద్దులకు భక్ష్యాలను తినిపించారు. అనంతరం వ్యవసాయ భూములకు వెళ్లి పూజలు చేసి వానాకాలం సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ పనులను ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో తోరణాలు తెంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దశంకరంపేటలో శనివారం ఏరువాక పున్నమి జరుపుకోనుండగా, రైతులు తమ పశువులను అందంగా అలంకరించడానికి తాళ్లు, గంటలు, ముగుతాడు, నల్లతాడులతో ఇతర సామగ్రి కొనుగోలు చేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/పెద్దశంకరంపేట







యోగా డే

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలుచోట్ల యోగాసనాలు వేశారు. సంగారెడ్డి యోగా సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయంలో యోగా గురువు దత్తు మహరాజ్ ఆసనాలు వేయించారు. అలాగే, మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ మైదానంలో వశిష్ఠ యోగా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో విద్యార్థులు ఆసనాలు వేశారు.





గద్దర్ ఆడిటోరియం పనులను ప్రారంభిస్తున్న మంత్రి

చెరువులు, కుంటలే తెలంగాణ బలం

తెల్లాపూర్‌ను 'తెలంగాణ పురం'గా మారుస్తాం

50 ఏళ్లలో హైదరాబాద్, సికింద్రాబాద్‌లను మరిపిస్తుంది

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


రామచంద్రాపురం, జూన్ 21 : చెరువులు, కుంటలు, కాలువలే తెలంగాణకు బలమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. తెల్లాపూర్‌లో రూ.8.4 కోట్లతో నిర్మించిన మున్సిపల్ భవనం, రూ.2 కోట్లతో నిర్మించ తలపెట్టిన గద్దర్ ఆడిటోరియం పనులకు శుక్రవారం ఆయన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకోకపోతే వైపరీత్యాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చెరువులు, కుంటలు, కాలువలను ఆక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెల్లాపూర్ వచ్చే 50 ఏళ్లలో హైదరాబాద్, సికింద్రాబాద్‌లను తలపించేలా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పదిహేను రోజుల్లో తెల్లాపూర్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈదులనాగులపల్లి రైల్వేబ్రిడ్జ్ వద్ద సర్వీస్ రోడ్డును పొడిగించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ఈదుల నాగులపల్లిలో రైల్వేశాఖ కోసం 425 ఎకరాల భూమిని కేటాయించడంపై రెవెన్యూ అధికారులు విచారణ జరపాలని కోరారు. ఈ భూమిని టి-5 లో చేర్చడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తెల్లాపూర్ అండర్ గ్రౌండ్ రైల్వేబ్రిడ్జి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. రైల్వేబ్రిడ్జి నుంచి ముందుకు రోడ్డు వసతి కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్ సంగారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు జ్యోతిశ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, కె.భరత్‌కుమార్, ఎస్.రాజు, మయూరి రాజుగౌడ్, లచ్చిరాంనాయక్, బాబ్జీ, సరిత, రాంసింగ్ నాయక్, పట్లోళ రవీందర్‌రెడ్డి, సుచరిత కొమురయ్య, మంజుల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, చిట్టి ఉమేశ్వర్, పావనిరవీందర్, శ్రీపాల్‌రెడ్డి, నాయకులు కాట శ్రీనివాస్‌గౌడ్, నీలం మధు, పి.శ్యాంరావు, మాజీ సర్పంచ్ బి.మల్లేశం గౌడ్, సోమిరెడ్డి, పాండురంగారెడ్డి, అరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైసలు వస్తేనే..

ట్రిపుల్ ఆర్ భూసేకరణకు సర్వం సిద్ధం

- భూమిని గుర్తించిన అధికార యంత్రాంగం
- నిధుల కోసం ఎదురుచూపులు
- కొలిక్కి రాని పరిహారం
- తుది ప్రజాభిప్రాయ సేకరణకు కసరత్తు





సంగారెడ్డి మండలం ఇరిగిపల్లిలో ట్రిపుల్ ఆర్ నిర్మాణం కోసం గుర్తించిన భూమి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 21 : రీజినల్ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణం కోసం భూమిని గుర్తించిన యంత్రాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విడుదల కోసం ఎదురుచూస్తున్నది. యాదాద్రి-భువనగిరి నుంచి 158 కి.మీ.ల పొడువున ఓఆర్‌ఆర్ చుట్టూ రీజినల్ రింగురోడ్డు నిర్మించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం రెండేళ్ల కిందటే ఆదేశించింది. ఆ మేరకు భూసేకరణ ప్రక్రియ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోలకు అప్పగించింది. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, అందోల్ రెవెన్యూ డివిజన్ల పరిధిలలో సేకరించాల్సిన భూమిని అధికార యంత్రాంగం గుర్తించింది. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడం, భూములకు ప్రాంతాలను బట్టి ధర నిర్ణయించకపోవడంతో ఏడాదిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ట్రిపుల్ ఆర్ పరిస్థితి తయారైంది.

వందలాది రైతులు.. వేలాది ఎకరాలు

ట్రిపుల్ ఆర్ నిర్మాణం కోసం అవసరమైన భూమిని సంగారెడ్డి జిల్లా యంత్రాంగం గుర్తించింది. సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలో 13 గ్రామాలలో పలువురు రైతులకు చెందిన వందల ఎకరాల భూమిని యంత్రాంగం ఎంపిక చేసింది. సంగారెడ్డి మండలం నాగాపూర్, ఇరిగిపల్లి, చింతలపల్లి, కలబ్‌గూర్, కులబ్‌గూర్, తాళ్లపల్లి, సంగారెడ్డి మండలాల్లో 322 మంది రైతులకు చెందిన 195.07 ఎకరాలను సేకరించాల్సి ఉంటుందని గుర్తించారు. హత్నూర మండలం కాసాల, దేవులపల్లి, సికింద్లాపూర్, దౌల్తాబాద్ గ్రామాలలో 296 మంది రైతులకు చెందిన 166 ఎకరాలను గుర్తించారు. కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్‌లలో అవసరమైన 195 ఎకరాలను ఎంపిక చేసిన అధికారులు రైతుల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. అందోల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పుల్కల్ మండలం వెండికోలు, వెంకటకిష్టాపూర్, కోర్పోల్, లింగంపల్లి, శివ్వంపేట గ్రామాలలో 581 మంది రైతులకు సంబంధించిన 298.23 ఎకరాలను గుర్తించారు.

ఇప్పటికే రెండుసార్లు నోటీసులు

ట్రిపుల్ ఆర్ నిర్మాణం కోసం భూమిని గుర్తించిన అధికారులు ఇప్పటికే ఎంపిక చేసిన రైతులకు రెండుసార్లు నోటీసులు అందజేశారు. ఆయా మండలాల్లో రెండుసార్లు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం భూ సేకరణ ప్రక్రియ తుదిరూపునకు రానున్నది.

మార్కెట్ ధర ఆధారంగా పరిహారం

భూసేకరణ కోసం భూమిని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రస్తుత ధర ఆధారంగా ప్రభుత్వం పరిహారం చెల్లించనున్నట్టు తెలిసింది. అయితే, రైతులు మాత్రం భూమికి భూమి ఇవ్వాలని పట్టుపడుతున్నారు. ఇది ప్రభుత్వానికి సంకటంగా మారింది. భూమిని ఎంపిక చేసిన ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్‌లో ఎకరా భూమి విలువ కోటి రూపాయలు పలుకుతున్నది. ప్రభుత్వం చెల్లిస్తామన్న పరిహారం రూ. లక్షల్లో ఉంటున్నది. అందుకే రైతులు తమ దగ్గర తీసుకున్న భూమికి మరో ప్రాంతంలో భూమి ఇవ్వాలని పట్టు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో జిల్లా యంత్రాంగం కూడా పరిహారంపై నిర్ణయం తీసుకోలేకపోతున్నది. నిధులు విడుదలైన అనంతరమే పరిహారం విషయం తేల్చి భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. రీజినల్ రింగురోడ్డు నిర్మాణంపై కొత్త ప్రభుత్వం చొరవ చూపుతున్నందున త్వరలోనే భూసేకరణ ప్రక్రియ మొదలయ్యే అవకాశాలున్నాయని తెలుస్తున్నది.

అధికారులు వేధిస్తున్నారని ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

- విధులను బహిష్కరించి నిరసన
- నిలిచిపోయిన బస్సులు

మెదక్ అర్బన్, జూన్ 21: అధికారుల వేధింపులు, పని భారంతో అనారోగ్యాల పాలవుతున్నామని మెదక్ ఆర్టీసీ డిపో ఎదుట డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. డిపో మేనేజర్ సుధ, సీఐ వీరాబాబు వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపోకు చెందిన 60 మంది డ్రైవర్లు శుక్రవారం తెల్లవారుజామున విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. దీంతో ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. ఆర్టీసీలో అద్దె బస్సులతో రాకపోకలు సాగించారు. విషయం తెలుసుకున్న పోలీసులు డీఎం, డ్రైవర్ల మధ్య సయోధ్య కుదిర్చేందుకు యత్నించారు. గంటన్నర పాటు కొనసాగిన చర్చలు విఫలమయ్యాయి. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ మెదక్ డిపో పరిధిలో సంస్థకు చెందిన 44 బస్సులను నడపడానికి 71 మంది డ్రైవర్లు ఉండగా.. టిమ్స్ డ్యూటీల పేరిట ఇద్దరు డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవడం లేదన్నారు. టిమ్స్ విధులపై వేధింపులు మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. గతంలో జేబీఎస్‌కు ఒక ట్రిప్పు డ్యూటీ వేస్తే.. ప్రస్తుతం రెండు ట్రిప్పులు వేస్తూ ఇబ్బందులకు గుర్తి చేస్తున్నారన్నారు. హోటల్‌లో భోజనం చేసి డిపోలో పడుకొని విధులను నిర్వహిస్తున్నామన్నారు. విశ్రాంతి లేకుండా డ్యూటీ చేస్తున్న 10 మంది డ్రైవర్లు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో ఉన్నారని తెలిపారు. జ్వరమొచ్చినా, అత్యవసరంగా సెలవు అడిగినా ఇవ్వడం లేదని వాపోయారు. సమస్యలపై వారం రోజుల ముందు డీఎంకు నోటీసు అందజేసినట్లు తెలిపారు. కాగా, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం సమక్షంలో డీఎం, డ్రైవర్ల మధ్య రెండు గంటలు చర్చలు జరిగాయి. మూడు నెలల్లో కొత్త రిక్రూట్మెంట్ అవుతుందని, అప్పటి వరకు డ్రైవర్లు సహకరించాలని డిప్యూటీ ఆర్ఎం కోరినట్టు తెలిసింది. డ్రైవర్లు తెలిపిన పలు సమస్యలకు అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు.



కొత్త బస్టాండ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళి

పటాన్‌చెరు, జూన్ 21: తెలంగాణ ఉద్యమ మార్గదర్శి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఆసుపత్రి ఎదుట ఉన్న జయశంకర్ విగ్రహానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పటాన్‌చెరులో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

నీట్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, జూన్ 21: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ డిమాండ్ చేశారు. మెదక్ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, చిలుముల సుహాసినిరెడ్డి తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీట్ లీకేజీకి బాధ్యతవహిస్తూ ప్రధాన మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు దొంతి లక్ష్మీముత్యంగౌడ్, మేడి కళ్యాణి మధుసూదన్, షమి, దాయర లింగం, లక్ష్మీనారాయణ గౌడ్, బొద్దుల రుక్మిణీకృష్ణ, నాయకులు జీవన్‌రావు, బొజ్జ పవన్, ఉప్పల రజేష్, జ్యోతి కృష్ణ, సుప్రభాత్‌రావు, గంగధార్, భరత్‌గౌడ్, ఎంపీపీలు ప్రశాంత్‌రెడ్డి, సిద్దిరాములు, నాయకులు ఆంజనేయులు, ఆవుల గోపాల్‌రెడ్డి, నరేందర్, పరశురాం గౌడ్, అహ్మద్, మెజాంబిల్, నూపి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే

ధరణి దరఖాస్తులను పరిష్కరించండి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి రూరల్, జూన్ 21 : ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆమె ఆర్డీవోలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తహసీల్దార్లు రెండు రోజుల్లో తమ లాగిన్‌లో ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో పరిష్కరించాలని ఆదేశించారు. స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఆర్డీవో లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ధరణి దరఖాస్తుల ప్రగతిపై రోజువారీగా పరిశీలించాలని ఆర్డీవోలను ఆదేశించారు. అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం రెండో రోజూ ఆందోళన



డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

రామాయంపేట, జూన్ 21 : రామాయంపేటలో డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం రెండో రోజూ ఆందోళన చేశారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. అనంతరం రాస్తారోకోకు దిగారు. అందుబాటులో ఉన్న ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో గతంలో పంపిణీ చేయగా మిగిలిపోయిన డబుల్‌బెడ్రూం ఇళ్లలోకి గురువారం కొందరు తాళాలు పగులగొట్టి బలవంతంగా చొరబడగా.. పోలీసులు చేరుకుని కేసులు పెడతామని హెచ్చరించడంతో ఖాళీ చేసిన విషయం తెలిసిందే.

జర్నలిస్టుపై మట్టి మాఫియా దాడి

కొండపాక, జూన్ 21: మండలంలోని జర్నలిస్టుపై మట్టి మాఫియా దాడి చేసింది. వెంచర్లకు మట్టి తరలిస్తున్న సమయంలో అటువైపు వెళుతున్న కొంతమంది విలేకరులను చూసి, తమ కోసమే వచ్చారని వారిని వెంబడించారు. వారి బైక్‌తో జర్నలిస్ట్ నరసింహారెడ్డి బైక్‌ను ఢీకొట్టారు. అతడిని కింద పడేసి చితకబాదారు. నరసింహారెడ్డిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, శుక్రవారం జిల్లా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగాచారి, అరుణ్‌కుమార్, విలేకరులు ఆయనను పరామర్శించారు. అనంతరం నిందితులపై చర్యలు తీసుకోవాలని సీపీ అనురాధకు వారు వినతి పత్రం అందజేశారు.

మార్డి పీఏసీఎస్ కార్యదర్శి సస్పెన్షన్

కల్హేర్, జూన్, 21 : మండల పరిధిలోని మార్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యదర్శి అరవింద్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార శాఖ అధికారి టి.ప్రసాద్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేయగా, శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అరవింద్ గౌడ్ విధులను సక్రమంగా నిర్వహించకుండా స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌తో కుమ్మక్కై సహకార సంఘానికి వచ్చిన ఆదాయంలో అవినీతికి పాల్పడ్డారని పేర్కొంటూ పీఏసీఎస్ వైస్ చైర్మన్, మరో ఐదుగురు డైరెక్టర్లు మార్చిలో డీసీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై నారాయణఖేడ్ సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ జి.చిన్నా విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. దీని ఆధారంగా మార్డి కార్యదర్శిని సస్పెండ్ చేస్తున్నట్లు డీసీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆపరేటర్ తప్పిదం... గృహజ్యోతికి అనర్హత

మిరుదొడ్డి, జూన్21 : అధికారుల తప్పిదంతో గృహజ్యోతి పథకం వర్తించక విద్యుత్తు బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదని మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి సుంకరి శ్రీనివాస్ శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తును చేసుకున్నాని తెలిపారు. అయితే, ఆపరేటర్ తప్పిదంతో గృహజ్యోతి పథకానికి అనర్హుడిని అయ్యానని వాపోయాడు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా ఎన్నికల కోడ్ ఉందని దాటవేశారని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికి గృహజ్యోతి పథకానికి వర్తింపు కావడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహజ్యోతి పథకానికి ఎంపిక చేయాలని కోరారు.

చెట్ల కొమ్మలు తొలగిస్తుండగా..సిమెంట్ దిమ్మెపడి

యువకుడు మృతి

● ఆగ్రహంతో పాలిటెక్నిక్ కళాశాలపై కుటుంబీకుల దాడి



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మృతుడి కుటుంబీకులు



సిమెంట్ దిమ్మెపడి మృతి చెందిన ఫకీరా

మెదక్ అర్బన్, జూన్ 21 : కూలీకి వచ్చిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పట్టణ పోలీసులు, కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండల పరిధిలోని బాలానగర్ రెడ్యా తండాకు చెందిన బానోత్ ఫకీరా(38) పట్టణంలోని ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో చెట్ల కొమ్మలు తొలగించేందుకు కూలీల అడ్డా నుంచి వచ్చాడు. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కొమ్మలు తొలగిస్తుండగా.. ఒక పెద్ద సిమెంట్ దిమ్మెపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన కళాశాల సిబ్బంది 108 అంబులెన్స్‌తోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ దిలీ‌ప్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డ ఫకీరాను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఫకీరా కుటుంబీకులు, బంధువులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కళాశాలపై దాడి చేశారు. అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ సీఐ కేశవులు, హవేళీఘణపూర్ ఎస్ఐ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఏఆర్ఎస్ఐ నరేష్ పోలీసు బందోబస్తుతో కళాశాలకు చేరుకున్నారు. మృతుడి కుటుంబీలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినకపోవడంత వాగ్వాదం చోటుచేసుకున్నది. ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి పోలీసులు హామీ ఇవ్వడంతో శాంతించారు. మృతుని తల్లి చాందీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఖర్జూరం తోటను సందర్శించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

రామాయంపేట, జూన్ 21 : రామాయంపేటలో వినూత్న పద్ధతిన సాగవుతున్న ఖర్జూరం తోటను వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం సందర్శించారు. రామాయంపేటకు చెందిన రైతు సత్యనారాయణ 14 ఎకరాల్లో ఇంగ్లాండ్, ఇరాన్, ఇరాక్ దేశాల నుంచి మొక్కలు తెచ్చి ఖర్జూరం తోటను సాగు చేస్తున్నాడు. వినూత్న పంటలతో ఆదర్శంగా నిలుస్తున్న రైతు వ్యవసాయ క్షేత్రాన్ని శాస్త్రవేత్తలు శంభాజీ, శ్రీకాంత్, జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య, రాజ్ నారాయణ సందర్శించి సత్యనారాయణను ప్రశంసించారు. ఈ పంట సాగుతో లాభాలు వస్తున్నాయని రైతు శాస్త్ర వేత్తలకు వివరించారు. కాగా ఇలాంటి కొత్త పద్ధతుల్లో పంటల సాగు చేయటం ప్రతీ రైతూ అలవర్చుకోవాలని వారు శాస్త్రవేత్తలు సూచించారు.



రామాయంపేటలో ఖర్జూరం సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జాతీయస్థాయి 'ఇన్‌స్పైర్'కు

ఇద్దరు విద్యార్థుల ఎగ్జిబిట్లు ఎంపిక

సిద్దిపేట డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



మారోజు బాలజీచారి



నర్మెట్ట కీర్తన

సిద్దిపేట రూరల్, జూన్ 21 : సిద్దిపేట జిల్లా నుంచి 2022-23నకు జాతీయస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఫేర్‌కు రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి మారోజు బాలాజీ చారి, సిద్దిపేట పట్టణంలోని విద్యావర్ధిని ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థిని నర్మెట్ట కీర్తన ఎగ్జిబిట్లు ఎంపికవ్వడం పట్ల డీఈవో వారిని అభినందించారు. విద్యార్థుల గైడ్ టీచర్, ప్రిన్సిపాల్‌లకు డీఈవో ఎల్లంకి శ్రీనివాసరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు.

హాల్ట్ స్టేషన్‌కు మోక్షమెప్పుడో?


- కొమురవెల్లిలో ఇంకా ప్రారంభం కాని పనులు
- ఎన్నికల కోడ్ ముగిసినా పట్టాలెక్కడం లేదు
- మొరం కుప్పలకే పరిమితం.. పూర్తికాని టెండర్లు

చేర్యాల, జూన్ 21 : కొమురవెల్లి మల్లన్న హాల్ట్‌స్టేషన్ నిర్మాణం పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. వచ్చే డిసెంబరులో జరిగే మల్లన్న కల్యాణానికి అందుబాటులోకి తీసుకువస్తామని ప్రజాప్రతినిధులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు ప్రకటించి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నో ఒడిదుడుకులు, మరెన్నో ఆందోళనలు, వినతుల ఫలితంగా హాల్ట్‌స్టేషన్ మంజూరైందని సంతోషించినా పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు. స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కొన్నిరోజులకే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో స్తబ్దుగా ఉన్నది. కోడ్ ముగిసి రెండువారాలు గడిచినా పురోగతి కానరావడం లేదు.

మధ్యప్రదేశ్ సీఎంతో శంకుస్థాపన

కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా కొమురవెల్లి గ్రామం మీదుగానే రైల్వేట్రాక్‌ను నిర్మించారు. చెంతనే ప్రముఖ శైవక్షేత్రమైన మల్లన్న ఆలయం ఉన్నప్పటికీ రైల్వేస్టేషన్ల జాబితాలో కొమురవెల్లిని చేర్చలేదు. స్వామివారి దర్శనార్థం యేటా లక్షలాదిమంది తరలిరావడంతో రవాణా సౌకర్యం మెరుగుదలతో పాటు పరిసరాల అభివృద్ధి దృష్ట్యా స్థానికంగా స్టేషన్ ఏర్పాటు చేయాలని భక్తులు, స్థానికులు డిమాండ్ చేశారు. స్థానిక, రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు రైల్వేశాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించారు. ఎన్నో ఒడిదుడుకుల నడుమ చివరకు కొన్నినెలల క్రితం హాల్ట్‌స్టేషన్‌ను మంజూరు చేశారు. ఫిబ్రవరి 15వ తేదీన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కొమురవెల్లి శివారులోని రైల్వేగేట్ సమీప ప్రదేశంలో పనులకు శంకుస్థాపన చేశారు. మల్లన్న ఆలయ ప్రాశస్త్యం చాటుతూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నామని ప్రకటించారు. మూడు నెలల్లో టెండర్ల ప్రక్రియ, మరో మూడు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి రానున్న డిసెంబరులో ప్రారంభం కానున్న మల్లన్న జాతరకు హాల్ట్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కానీ కొద్దిరోజులకే పార్లమెంటు ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియలో జాప్యం చోటుచేసుకున్నది. అప్పటికే సాంకేతికపర అనుమతులు, సర్వే ఇతరత్రా ప్రక్రియ పూర్తిచేయగా, ఎన్నికల కోడ్ ముగిసి రెండు వారాలు గడిచినా పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టకపోవడంతో సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ ఉన్నతాధికారులు చొరవ చూపించి త్వరితగతిన పనులు ప్రారంభింపచేయాలని భక్తులు కోరుతున్నారు. మల్లన్న కల్యాణంలోగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.





రైల్వేహాల్ట్ స్టేషన్ ప్రదేశంలో పోసిన మొరం కుప్పలు, రైల్వేస్టేషన్ నమూనా



మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్‌తో కలిసి భూమిపూజ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి(ఫైల్)

త్వరలో ప్రారంభిస్తాం

టెండర్ల ప్రక్రియ నిర్వహణ, సర్వే పూర్తికి కొంత సమయం పట్టనుంది. రైల్వే హాల్ట్‌స్టేషన్ పనులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రాథమికంగా పనులు ప్రారంభమయ్యాక ఎలాంటి జాప్యం జరగదు.

- జనార్ధన్, రైల్వే డీఈ

ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు వద్దు

- చైతన్య సదస్సును బహిష్కరించిన గ్రామస్థులు
- రోడ్డుపై బైఠాయించడంతో స్తంభించిన ట్రాఫిక్
- అదనపు కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

గుమ్మడిదల, జూన్ 21 : ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటుపై పల్లెవాసులు భగ్గుమన్నారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చైతన్య సదస్సును శుక్రవారం గుమ్మడిదలలోని ప్రజా వేదికలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో పాటు జీహెచ్ఎంసీ సీవో కోటేశ్వరావు, ఆర్డీవో వసంత కుమార్, తహసీల్దార్ గంగాభవాని హాజరయ్యారు. డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తున్న వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ఇక్కడ డంపుయార్డు ఏర్పాటు చేయొద్దు అంటూ నినాదాలు చేస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దాదాపు గంటసేపు ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. పచ్చని చెట్ల మధ్య ఆరోగ్యంగా జీవించే తమకు ఈ దుర్గంధంతో కూడిన డంపుయార్డు వద్దే వద్దు అంటూ ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఆందోళనతో గుమ్మడిదల రోడ్డులో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పందిస్తూ డంపుయార్డును వ్యతిరేకిస్తున్న ప్రజల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పలువురు పాల్గొన్నారు.



ఆందోళనకారులకు నచ్చచెబుతున్న తహసీల్దార్ గంగాభవాని



కోత యంత్రాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

ఎర్రరాయి మైనింగ్‌పై దాడులు

● 3 లారీలు, 3 ట్రాక్టర్లు, 4 కోత యంత్రాలు సీజ్

జహీరాబాద్, జూన్ 22 : మండలంలోని ఎర్రరాయి తవ్వకాలపై శుక్రవారం జిల్లా మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు ఆకస్మిక దాడుల నిర్వహించారు. జహీరాబాద్ మండలంలోని ఆనెగుంట, శేఖాపూర్, హోతి(కే) తదితర గ్రామాల్లో అధికారులు దాడులు చేశారు. ఈ తనిఖీల్లో మూడు లారీలు, మూడు ట్రాక్టర్లు, నాలుగు కోత మిషన్‌లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మే 26న ఎర్రరాయి తవ్వకాలపై 'తవ్వేయ్.. అమ్మేయ్' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై

అవగాహన కల్పించాలి

● సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, జూన్ 21 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరంతో, నీళ్ల విరేచనాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందించాలన్నారు. అవసరమైన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, మందులను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. మండల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ఆరోగ్య సమస్యలకు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను మెరుగు పరచాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యులు కాశీనాథ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజాంపేట, జూన్ 21 : మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం నిజాంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. 'అద్దె చెల్లించడం లేదని తహసీల్దార్ కార్యాలయానికి తాళం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిజాంపేట మండలం ఏర్పడడంతో ప్రభుత్వ కార్యాలయం లేక ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కొనసాగిస్తున్నామన్నారు. అది పురాతన ఇల్లు కావడంతో వర్షాకాలంలో ఇబ్బందిగా ఉంటుందని, వేరొక చోటుకు మార్చేందుకు ప్రతిపాదన వచ్చిందని, ఈ స్థలాన్ని పరిశీలించామని ఆయన తెలిపారు. అనంతరం ధరణి స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని, మండల వ్యాప్తంగా 64 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్ కుమార్, ఆర్ఐ గంగాధర్ గౌడ్, ఆపరేటర్ శ్రీకాంత్, శ్వేత తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి భవనాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

వివాహిత ఆత్మహత్య

● తల్లిదండ్రుల ఫిర్యాదుతో అత్తింటి వారిపై కేసు



సుమలత(ఫైల్)

కల్హేర్, జూన్ 21 : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల ప్రవీణ్‌తో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల పరిధిలోని అంకుల్‌పేట్ గ్రామానికి చెందిన సుమలత(24)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు పుట్టకపోవడంతో పాటు తరచూ గొడవలు జరుగుతుండడంతో సుమలత పుట్టింటికి వెళ్లింది. పెద్ద మనుషులు పంచాయితీలో నచ్చజెప్పడంతో సుమలత అత్తవారి ఇంటికి వచ్చింది. అయినప్పటికీ కుటుంబ కలహాలు తరచూ జరిగేవి. అత్తవారింట్లో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమలత ఉరివేసుకున్నది. శుక్రవారం సుమలత పుట్టింటివారు గ్రామానికి వచ్చి ఆందోళన చేసి న్యాయం చేయాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అత్తింటి వారే లలితను చంపి ఉంటారని ఆరోపించారు. తాము రాక ముందే మృతదేహాన్ని ఆసుపత్రికి ఎందుకు తరలించారని కల్హేర్ ఎస్ఐ వెంకటేశంను సుమలత బంధువులు నిలదీశారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు వారికి హామీ ఇచ్చి సముదాయించారు. దీంతో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో సుమలత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పుట్టింటి వారే అంత్యక్రియలు జరిపిస్తామని మృతదేహాన్ని తీసుకువెళ్లారు. మృతురాలి తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు భర్త ప్రవీణ్, అత్త, మామ, బావ, తోడికోడలుపై కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వం

ఆ కాలనీకి శాపం

● నర్సాపూర్ విఘ్నేశ్వర కాలనీవాసుల్లో వర్షాకాలం గుబులు ● మూడేళ్లుగా వాన నీటితో ఇబ్బందులు



విఘ్నేశ్వరకాలనీలోని ఓ వీధిలో కాలువలా పారుతున్న వర్షపు నీరు(ఫైల్)

నర్సాపూర్, జూన్ 21 : నర్సాపూర్ పట్టణంలోని 9వ వార్డులో ఉన్న విఘ్నేశ్వరకాలనీ వాసులకు వర్షాకాలం రావడంతో గుబులు పట్టుకున్నది. విఘ్నేశ్వరకాలనీ ఆర్టీసీ బస్టాండుకు, నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డుకు అతీ సమీపంలో ఉంది. మూడేళ్లుగా ప్రతీ వానాకాలంలో ఇక్కడి వీధుల్లో వర్షపు నీరు కాలువల్లా పారుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధల అలసత్వమే వారికి శాపంగా మారింది.

కుంట పూడ్చివేతతో తిప్పలు

పట్టణ ప్రగతిలో భాగంగా మూడేళ్ల క్రితం రూ.20 లక్షలతో ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఉన్న కుంటను పూడ్చేశారు. ఆ స్థలంలో ఉద్యానవనం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే, కుంటను పూడ్చారు తప్ప ఉద్యానవనం మాత్రం ఏర్పాటు చేయలేదు. కుంట పూడ్చివేత సమయంలోనే అందులోకి వచ్చే వరద నీటిని మళ్లించే ఏర్పాట్లు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించారు. దీంతో ఆ కాలనీ వాసులకు మూడేళ్లుగా వానాకాలంలో తిప్పలు తప్పడం లేదు.

నిధులు కేటాయించిన పనులు శూన్యం

వరద నీరు మళ్లించేందుకు కాలువ నిర్మాణానికి ఏడాది క్రితం రూ.25 లక్షలను కేటాయించారు. పనులను ప్రారంభించినా కాంట్రాక్టర్ కొద్ది దూరం మాత్రమే చేసి ఆపేశారు. దీంతో సమస్య మరింత జటిలంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పెద్దమ్మకాలనీ వాసుల పరిస్థితి అంతే

ఇదే 9వ వార్డులోని పెద్దమ్మకాలనీ వాసులకూ తిప్పలు తప్పడం లేదు. కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం పడినపుడల్లా నీరంతా ఇళ్ల మధ్యలోకి చేరి బయటకు రాని పరిస్థితి నెలకొంటుంది. భారీ వర్షం వస్తే ఇళ్లలోని వారు బయటకు, బయట వారు కాలనీలోకి వెళ్లలేని దుర్భర పరిస్థితి తలెత్తుతుంది.


సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో యోగాసనాలు వేస్తున్న పోలీసు సిబ్బంది


సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా సాధన చేస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి, ఉపాధ్యాయులు


సంగారెడ్డిలోని తారా కళాశాలలో యోగా చేస్తున్న అధ్యాపకులు


సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని పార్కులో వాకర్స్ అసోసియేషన్ సభ్యుల యోగా


జహీరాబాద్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె. సూరిక్రిష్ణ


జహీరాబాద్: ఆదర్శనగర్‌లో యోగా గురువు నారాయణను సన్మానిస్తున్న యోగసాధకులు


జహీరాబాద్: గురుకుల పాఠశాలలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శన


నారాయణఖేడ్‌లో కోర్టు సిబ్బందితో యోగాసనాలు వేయిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్‌మంథాని


హత్నూర: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మానసిక ఒత్తిడిని దూరం చేసే
దివ్యౌషధం యోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో యోగసనాలు వేయించారు. మానసిక ఒత్తిడిని దూరం చేసే దివ్యౌషధం యోగా అని యోగా ట్రైనర్లు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ యోగ సాధన క్రమం తప్పకుండా చేసినట్లయితే మానసిక పరిపక్వతతో పాటు ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని వివరించారు. చదువుల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పలు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమాల్లో ఆయా జిల్లాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, యోగా గురువులు, సాధకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

-న్యూస్ నెట్‌వర్క్(సంగారెడ్డి, మెదక్), జూన్ 21


బొల్లారం మోడల్ పాఠశాలలో విద్యార్థుల సాధన


వట్‌పల్లి: యోగా డేలో అధికారులు, ప్రజలు


మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో వశిష్ఠ యోగ అకాడమీ ఆధ్వర్యంలో యోగసాధన చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


మెదక్‌లో విద్యార్థుల యోగసాధన


నర్సాపూర్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన యోగా డేలో జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత


చేగుంట: ఎస్సీ గురుకుల పాఠశాలలో జీవన మంత్ర యోగాఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగసాధన చేస్తున్న విద్యార్థులు


కొడిపల్లి ధర్మసాగర్ ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో


రామాయంపేట: గురుకుల పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు


పెద్దశంకరంపేట: శ్రీసర్వసతీశిశుమందిర్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


చిలప్‌చెడ్: ఫైజాబాద్ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

'నీట్'లో అక్రమాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి





నర్సాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, పటాన్‌చెరులో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నర్సాపూర్, జూన్ 21: నీట్ ప్రవేశ పరీక్షలో అక్రమాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని విద్యార్థులకు న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తూ, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నర్సాపూర్‌లోని కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి మెదక్ ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి జాతీయ రహదారిపై మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకు లు సుహాసినిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, రిజ్వాన్, మల్లేశం, డి.అంజిగౌడ్, జ్యోతిసురేష్‌నాయక్, మణిదీప్, శ్రీశైలం యాదవ్,రాధకిషన్‌గౌడ్‌తో పాటు ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

● పటాన్‌చెరు: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జాతీయ స్థాయిలో నీట్ పరీక్షా పత్రం లీకవడం సిగ్గుచేటని ఆరోపిస్తూ శుక్రవారం పటాన్‌చెరులో కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. జాతీయరహదారిపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నాయకులు సంజీవరెడ్డి, కిషన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: నీట్ ప్రవేశ పరీక్షలలో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జీతో న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లపల్లి రమేష్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ భవన్ వరకు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లపల్లి రమేష్, సహాయ కార్యదర్శి నవీన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. నీట్ పరీక్షలను రద్దు చేసి మళ్లీపరీక్షలను నిర్వహించాలని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రాథోడ్, ఎస్టీసెల్‌నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నెహ్రూనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నారాయణఖేడ్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రేమ్‌సింగ్, మోహన్, దేవిదాస్, రాజు పాల్గొన్నారు.

ఖేడ్‌లో జయశంకర్‌కు ఘననివాళి


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్, జూన్ 21: కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆచార్యజయశంకర్ 13వ వర్ధంతిని ఖేడ్ పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో ఆయన పాత్ర కీలకమని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్‌అలీ, నియోజకవర్గ కాంగ్రెస్ బీసీ, ఎస్సీఎస్టీసెల్ అధ్యక్షుడు సాయిలుపటేల్, సాయిలు, నెహ్రూనాయక్, మాజీ జడ్పీటీసీ చందర్‌నాయక్, నాయకులు గుత్తిరమేష్, మూడ్రశీను, మాణిక్యంచారి, యాదగిరి, గౌస్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఖేడ్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, విశ్వకర్మ సంఘం బాధ్యులు వడ్ల కాశీనాథ్, కంచర్ నరేందర్, కమ్మరిరాజు, జైపాల్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.


రైతు సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవల అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ రమేష్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మునిపల్లి, జూన్ 21: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవల ఆథారిటీ సీనియర్ సివిల్ జడ్జి రమేష్, సెక్రటరీ రమేష్ పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మునిపల్లి రైతు వేదికలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవల ఆథారిటి సీనియర్ సివిల్ జడ్జి రమేష్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం వివిధ పథకాలను, జాతీయ పించన్ పథకం, వృత్తి నైపుణ్యం, ప్రధానమంత్రి ఫసల్ యోజనతో తదితర పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తన లోపంతో పంట నష్టం జరిగితే రైతులు న్యాయస్థానాన్ని ఎలా ఆశ్రయించాలో వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. అలాగే రైతులకు పత్తి పంటపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా డీఏవో అంబికా సోని, ఏడీఏలు శ్రీనివాస్ ప్రసాద్, సత్యనారాయణ, తహసీల్దార్ తెన్‌మొళి, మండల వ్యవసాయాధికారి శివకుమార్, ఏఎస్ఐ భిక్షపతి, ఏఈవోలు, ఇన్‌పుట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఎస్ఏ బదిలీల

సీనియారిటీ జాబితా విడుదల

● నేడు వెబ్‌ఆప్షన్ల నమోదు

సంగారెడ్డి అర్బన్, జూన్ 21: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్న వేళ జడ్పీ యాజమాన్య పరిధిలోని(మల్టీజోన్-2) స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు సంబంధించిన తుది సీనియారిటీ జాబితాను ఎట్టకేలకు విడుదల చేశారు. ఈ మేరకు ఆ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. స్కూల్ అసిస్టెంట్‌తో పాటు పీఎస్‌హెచ్‌ఎం సీనియారిటీ జాబితాను కూడా విడుదల చేశారు. విద్యాశాఖ విడుదల చేసిన జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి వెంట వెంటనే పరిష్కరింపజేస్తున్నారు. శుక్రవారం సాయంత్రంలోగా సీనియారిటీ జాబితా, ఖాళీల అప్‌డేట్ చేయాలని ఆదేశాలున్న నేపథ్యంలో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఎస్ఏ బదిలీలకు సంబంధించి బదిలీ కోసం వెబ్ ఆప్షన్ నమోదు ప్రక్రియను శనివారం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థుల బస్సుపాసుల కోసం

యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్ పొందాలి: డీఎం

నారాయణఖేడ్, జూన్ 21: విద్యార్థులకు సంబంధించిన బస్సుపాసులను పొందడం కోసం పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్‌లను పొందాలని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు ప్రస్తుత విద్యాసంవత్సరం పునః ప్రారంభమైన అయినందున, బస్సుపాసుల జారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాసుల కోసం విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని ఫోన్ నెంబరును తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. బస్సులపాసుల ఫారాన్ని ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు అప్రూవల్ చేసిన అనంతరం విద్యార్థుల ఫోన్‌కు మేసేజ్ వస్తుందన్నారు. మేసేజ్‌ను బస్‌పాస్ కౌంటర్‌లో చూపించి పాసులను పొందాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9959223170, 7382800834, 9676667703 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రైవేటు స్కూళ్ల దోపిడీని అరికట్టాలి

● ఏబీవీపీ ఉమ్మడి మెదక్ జిల్లా హాస్టల్ కన్వీనర్

జహీరాబాద్, జూన్ 21: జహీరాబాద్ పట్టణంలో వెలసిన ప్రైవేటుపాఠశాలల యాజమాన్యాలు బ్రాండ్ల పేరుతో పుస్తకాలను, నోట్ పుస్తకాలను అమ్ముతూ విద్యావస్థను భ్రష్టుపట్టిస్తున్నాయని ఏబీవీపీ ఉమ్మడి మెదక్ జిల్లా హాస్టల్‌కన్వీనర్ ప్రవీణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలలకు చెందిన పుస్తకాలు, యూనిఫాంలను తాము చెప్పినచోటే కొనుగోలు చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగే పాఠశాలలపై ఫిర్యాదులు చేసినా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. కొన్ని పాఠశాలల్లో త్వరలో పర్మిషన్ వస్తుందంటూ ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్రైవేటు యాజమాన్యాల ఆగడాలను నిరసిస్తు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, మైపాల్, ఆదికేశవులు, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చేగుంట, జూన్ 21: చేగుంట ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంగ్లిష్ గెస్ట్ టీచర్ పోస్టు కోసం ఈ నెల 24న దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ భూపాల్ రెడ్డి తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్, బీఈడీ, అర్హతతో పాటు అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ భూపాల్ రెడ్డి కోరారు.

చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి క్రైం, జూన్ 21: పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువులో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు గుర్తు తెలియని సుమారు 40 ఏళ్ల లోపు వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఛామన ఛాయరంగు, గుండ్రటి ముఖం కలిగి, ఎడమ వైపు ఛాతిపై మమత అని తెలుగులో పచ్చబొట్టు ఉందని వివరించారు. ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు

సంగారెడ్డి క్రైం, జూన్ 21: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురు వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువడింది. ఆరుగురిలో నలుగురికి రెండు రోజులు, ఇద్దరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ మార్నింగ్ కోర్టు జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ షకీల్ అహ్మద్ సిద్దిక్ శుక్రవారం తీర్పు చెప్పారు. జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం.... సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లో పోలీసులు ఇటీవల వాహన తనిఖీలు చేపట్టగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కర్నూల్‌కు చెందిన యువరాజ్, సంగారెడ్డికి చెందిన రియాజుద్దీన్, సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన పాండయ్య, వికారాబాద్ జిల్లా పట్లూరుకు చెందిన లాలూ ప్రసాద్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బసవరాజ్, విక్రమ్‌లకు మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

కొత్తపేటలో నల్లమట్టి అక్రమ నిల్వల పరిశీలన

శివ్వంపేట, జూన్ 21: నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసాచారి హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపేట శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలో ఇటుక బట్టీ కోసం అక్రమంగా నిలువచేసిన చేసిన సుమారు 400కు పైగా ట్రాక్టర్ల నల్ల మట్టిని శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ షఫియోద్దీన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొత్తపేట శివారులో అక్రమంగా డంపు చేసిన నల్లమట్టి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఆ మట్టిని బహిరంగ వేలం వేయనున్నట్టు తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన హిటాచీ

తూప్రాన్, జూన్ 21: రాత్రి సమయాల్లో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న మూడు టిప్పర్లు, హిటాచీలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సంఘటన మండలంలోని ఘనపూర్, పట్టణ పరిధి రావెల్లిలలో శుక్రవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. మండలంలోని ఘనపూర్ శివారులో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ శివానందం సిబ్బందితో దాడులు చేశారు. ఈ సందర్భంగా మట్టి రవాణా చేస్తు టిప్పర్, హిటాచీలను పట్టుకొని సీజ్ చేశారు. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి - కరీంగూడ వద్ద అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు మట్టి టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

బటర్ ఫ్లై లైట్లను ప్రారంభించిన మంత్రి

రామచంద్రాపురం, జూన్ 21: రూ. 4.78 కోట్లతో రేడియల్ రోడ్లపై నవనిర్మాణ అసోసియేట్స్ టార్గెట్ మీడియా, డెవలప్‌మెంట్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌ఓటీ) పద్ధతిలో ఏర్పాటు చేసిన వీధిదీపాల (బటర్ ఫ్లై లైట్స్)ను శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. నల్లగండ్ల నుంచి గోపన్‌పల్లి వరకు, గోపన్‌పల్లి నుంచి కొల్లూరు ఓఆర్ఆర్ జంక్షన్ వరకు, నల్లగండ్ల నుంచి రేడియల్ రోడ్డు నంబరు 7 మీదుగా కొల్లూరు జంక్షన్, మోకిల వరకు రోడ్డు మధ్యలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. కాగా ఇప్పటికే పూర్తయిన వీధిదీపాలను మంత్రి ప్రారంభించారని కమిషనర్ తెలిపారు.

పంట పొలాలను పరిశీలించిన డీఏవో

అల్లాదుర్గం, జూన్ 21: మండలంలోని పెద్దపూర్ గ్రామంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు నమోదు చేసిన పంట వివరాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి సర్వే నెంబర్ వారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట మార్పిడి, పత్తిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, వరి పంట యొక్క నారుమడిలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం గ్రామ పరిధిలో ఉన్న విత్తన, ఎరువుల దుకాణాలను పరిశీలించారు. డీఏవో వెంట మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఏఈవోలు అమృత్ తదితరులు పాల్గొన్నారు.

25న జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

సంగారెడ్డి అర్బన్, జూన్ 21: సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 25 న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ ల్యాబ్స్‌లో టెక్నికల్ ట్రెయినీ సెలక్షన్స్ కోసం ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీపీసీ లేదా ఎంపీసీ లేదా ఒకేషనల్ విద్యార్థులైతే ఎంఎల్‌టీ బ్రిడ్జి కోర్సు పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఎస్సెస్సీలో కనీసం 60 శాతం, ఇంటర్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు బీఎస్సీ డిగ్రీ చదివిస్తూ టెక్నికల్ ట్రైనింగ్ ఇస్తారన్నారు. ట్రైనింగ్ పిరియడ్‌లో నెలకు రూ. 11 వేల స్కాలర్‌షిప్, ఉచిత వసతితో పాటుగా ఉచిత రవాణ సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. ట్రైనింగ్ తర్వాత కంపెనీలో ఉద్యోగం పర్మనెంట్ చేస్తారని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఎస్సెస్సీ మెమో, ఇంటర్ మెమో, ఆధార్ జిరాక్స్ కాపీలతో ఉదయం 9.30 గంటల వరకు హాజరుకావాలన్నారు.

తాగునీటి సమస్యను నివారణకు కృషి: చింతా ప్రభాకర్


ఫసల్‌వాది శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నీటి సంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, జూన్ 21 : తాగునీటి సమస్యను పూర్తిగా నివారించేందుకే వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసినట్టు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని ఫసల్‌వాది గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో శుక్రవారం 100 కేఎల్ సామర్థ్యం గల నీటి ట్యాంకును ప్రారంభించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బుచ్చయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పార్టీ నుంచి మంజూరైన రూ. 2 లక్షల బీమా చెక్కును మృతుడి భార్య అనితకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, సంగారెడ్డి జడ్పీటీసీ సునీత మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి: జడ్పీటీసీ

కోహీర్ జూన్ 21: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోహీర్ మండల జడ్పీటీసీ జి రాందాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కవేలి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, ఏపీవో సునందరావు, టెక్నికల్ అసిస్టెంట్ దశరథ్, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

● ఝరాసంగం, జూన్ 2: ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని ఝరాసంగం ఎంపీడీవో సుధాకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగ శుక్రవారం మండలంలోని బర్దీపూర్, తదితర గ్రామాల్లో ఆయన మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీవో రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

జోగిపేట, జూన్ 22: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, జోగిపేట సీఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జోగిపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్నేహ మంజీర అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023-24వ సంవత్సరంలో పదవతరగతిలో మంచి ఫలితాలు సాధించిన ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు.